

ఈవీఎం గోడౌన్ పరిశీలన

లక్ష్మీపురం: గుంటూరు కలక్టరేట్ ఆవరణలోని గోడౌన్ భద్రపర్చిన ఈవీఎంలను జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి గురువారం పరిశీలించారు. ఆమె వెంట అధికారులు ఉన్నారు.



అమ్మవారి హుండీ లెక్కింపు

నరసరావుపేటరూరల్: ఇస్సప్పాలెంలోని మహంకాళి ఆలయంలో కానుకల హుండీ లెక్కించగా నాలుగు నెలలకు రూ.8,30,922 ఆదాయం వచ్చినట్లు అధికారులు గురువారం తెలిపారు.

నేడు కోటి పడగల పుణ్యక్షేత్రం మహోత్సవం



భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం కోనేటిపురంలోని కోటి పడగల పుణ్యక్షేత్రమైన వేంకటేశ్వర సుబ్రహ్మణ్యేశ్వస్వామి దేవస్థానం షష్టి పూర్తి వార్షిక మహోత్సవం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు వంగర చలమయ్య సిద్ధాంతి, జొన్నా వెంకటరత్నం పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

సాగర్‌ను సందర్శించిన 23 దేశాల ప్రతినిధులు



విజయపురిసౌత్: అంతర్జాతీయ పర్యాటక కేంద్రం నాగార్జునసాగర్‌ను బుధవారం 23 దేశాలకు చెందిన 27 మంది ప్రతినిధులు సందర్శించారు. నేపాల్, శ్రీలంక, రష్యా, వియత్నాం, జింబాబ్వే, నైజీరియా, తదితర 23 దేశాల ప్రతినిధులు ఈ నెల 15వ తేదీ నుంచి హైదరాబాదులోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో 'నూతన ఆవిష్కరణలు–అభివృద్ధి' అనే అంశంపై శిక్షణ పొందుతున్నారు. ఈ నెల 30వ తేదీతో శిక్షణ ముగియనుంది. దీనిలో భాగంగా టీం కో–ఆర్డినేటర్ డాక్టర్ సురేష్ కుమార్ ఆధ్వర్యంలో నాగార్జున సాగర్‌ను సందర్శించారు. వీరికి టూరిజం గైడ్ సత్యనారాయణ నాగార్జున కొండ చారిత్రక విశేషాలను, నాగార్జున సాగర్ ప్రాజెక్టు వివరాలను, బుద్ధవనం విశేషాలను వివరించారు. వీరి వెంట తెలంగాణ అధికారులు ఎస్‌పీఎఫ్ ఎస్ఐ రఘు, తదితరులు ఉన్నారు.

నేడు జీజీహెచ్ మెడికల్ బోర్డులో పరీక్షలు


గుంటూరు ఎడ్యుకేషన్: డీఎస్సీ–2025 సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరైన విభిన్న ప్రతిభావంతులైన అభ్యర్థులకు ఈనెల 29న జీజీహెచ్ మెడికల్ బోర్డులో పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వైకల్య నిర్ధారణ పరీక్షల నిమిత్తం జీజీహెచ్ మెడికల్ బోర్డుకు రూ.1500 చెల్లించాలని సూచించారు.

డీఎంహెచ్ఓ కార్యాలయం వద్ద ఏఎన్ఎంల నిరసన



గుంటూరు మెడికల్: ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఆరు మాసాల కిందట జరిగిన మొదటి జాబితాలో ఉద్యోగోన్నతి రావాల్సి ఉండగా అధికారుల నిర్లక్ష్యం వల్ల ఆలస్యం అయ్యిందని ఏఎన్ఎంలు వాపోయారు. గురువారం ఉదయం కూడా కౌన్సెలింగ్ నిర్వహించకుండా తరువాత నిర్వహిస్తామని చెబుతున్నారని పేర్కొంటూ మాకు న్యాయం చేయాలంటూ ఏఎన్ఎంలు ఆందోళనకు దిగారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం రెండో ఉద్యోగోన్నతి జాబితా సిద్ధం చేసి దాని ప్రకారం తక్షణమే చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని డిమాండ్ చేశారు.

పశ్చిమ డెల్టాకు 5,007 క్యూసెక్కులు విడుదల



దుగ్గిరాల: విజయవాడ ప్రకాశం బ్యారేజీ నుంచి గురువారం 5,007 క్యూసెక్కులు విడుదల చేసినట్లు నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 12.5 అడుగులు నీటి మట్టం ఉంది. దుగ్గిరాల సబ్ డివిజన్ హైలెవెల్‌కు138, బ్యాంక్ కెనాల్ 1,241, తూర్పు కాలువకు 547, పశ్చిమ కాలువకు 229, నిజాపట్నం కాలువకు 428, కొమ్మూరు కాలువకు 1,760 క్యూసెక్కులు విడుదల చేశారు. 4,16,622 క్యూసెక్కులు సముద్రంలోకి పంపుతున్నారు.

30న ఉద్యోగ మేళా

లక్ష్మీపురం (గుంటూరు వెస్ట్): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈ నెల 30వ తేదీన ఉద్యోగ మేళా నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కొండా సంజీవరావు గురువారం తెలిపారు. లక్ష్మీపురంలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వద్ద గల పాంటలూన్స్–షోరూమ్‌లో ఉదయం 10 గంటలకు నిర్వహించే జాబ్ మేళాకు ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, బీటెక్, డిప్లొమా, ఫార్మసీ, పీజీ చేసిన 18–35 ఏళ్ల మధ్య వయసు గల వారు హాజరు కావచ్చని చెప్పారు. బయోడేటా, సర్టిఫికెట్ల జిరాక్స్, ఆధార్ నకలు, పాస్‌పోర్ట్ ఫొటోతో నేరుగా ఇంటర్వ్యూకు హాజరు కావాలని తెలిపారు. ఇతర వివరాలకు అట్ల రామకృష్ణారెడ్డిని 77319 82861 ఫోను నంబరులో సంప్రదించవలసిందిగా కోరారు.

చిరుద్యోగులపై కూటమి కక్ష

విద్యుత్ సబ్‌స్టేషన్లలో విధులు నిర్వర్తిస్తున్న షిఫ్ట్ ఆపరేటర్లపై వేటు

- ఉద్యోగం పోవడంతో బలవన్మరణానికి గిరిజన యువకుడు తిరుపతిరావు యత్నం
- కనీసం నోటీసులు ఇవ్వకుండా తొలగింపు
- జిల్లాలో ఉద్యోగాలు కోల్పోయి రోడ్డున పడిన యువత
- వారి స్థానంలో రూ.లక్షలు వసూలు చేసి కొత్తవారికి అవకాశం
- జిల్లాలో మితిమీరిన కూటమి నేతల వేధింపులు
- న్యాయం చేయకపోతే ఆత్మహత్యలే శరణ్యం అంటున్న షిఫ్ట్ ఆపరేటర్లు



కొమెరపూడిలో 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్

సత్తెనపల్లి: బాబు వస్తే జాబు వస్తుందని ... జాబు వచ్చేవరకు నిరుద్యోగ భృతి ఇస్తామని ప్రచారం చేసి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కొత్తగా ఉద్యోగాలు ఇవ్వకపోగా ఉన్న ఉద్యోగులను తొలగిస్తుంది. గత ప్రభుత్వంలో నియామకాలు జరిగాయన్న సాకుతో వందలాది మందిని ఉద్యోగాల నుంచి తొలగించి వారి కుటుంబాలను అర్థంతరంగా రోడ్డున పడేస్తున్నారు. జిల్లాలోని విద్యుత్ సబ్‌స్టేషన్లలో పనిచేస్తున్న షిఫ్ట్‌ఆపరేటర్లను తొలగించి కూటమి నేతలు సిఫార్సు చేసిన వారికి ఉద్యోగాలు కల్పిస్తున్నారు. తొలగించిన వారి స్థానాల్లో కొత్తవారిని నియమించేందుకు కూటమి నేతలు రూ.5 లక్షలు, రూ.10 లక్షలు వసూలు చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

వైఎస్సార్ సీపీ సానుభూతిపరులనే..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడక ముందే విద్యుత్ సబ్‌స్టేషన్‌లలో షిఫ్ట్ ఆపరేటర్లుగా జిల్లాలో 200 మందికి పైగా విధులు నిర్వర్తిస్తున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వారిని తొలగించే కార్యక్రమం చేపట్టలేదు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విప్లవాత్మకంగా ప్రవేశపెట్టిన గ్రామ/వార్డు సచివాలయ సిబ్బంది నియామక పరీక్షల్లో షిఫ్ట్ ఆపరేటర్లకు కొంత ప్రాధాన్యం ఇవ్వడంతో సుమారు 45 మంది వరకు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు.

కూటమి అధికారంలోకి వచ్చాక 120 మంది తొలగింపు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నియామకాలు పొందిన వారిపై కూటమి నేతలు కక్ష కట్టారు. విద్యుత్ శాఖ అధికారుల ద్వారా ఒత్తిడి చేయించి ఉద్యోగాల నుంచి ఒక్కొక్కరుగా తొలగించే కార్యక్రమం మొదలుపెట్టారు. ఇప్పటికే జిల్లాలో 120 మందికి పైగానే తొలగించారు. ఇదే క్రమంలో శావల్యాపురం మండలం వేల్పూరు గ్రామానికి చెందిన ఉయ్యాల తిరుపతిరావు 2019లో వేల్పూరు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో కాంట్రాక్టు షిఫ్ట్ ఆపరేటర్‌గా చేరి విధులు నిర్వర్తిస్తున్నాడు. ఈ ఏడాది ఏప్రిల్ 25న తిరుపతిరావును ఉద్యోగం నుంచి తొలగించడంతో ఆర్థిక పరిస్థితి దెబ్బతింది. భార్య అలిగి పుట్టింటికి వెళ్లింది. ఈ క్రమంలో తిరుపతిరావు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఇదే కోవలో కొమెరపూడిలో ఈనెల 21న నలుగురు షిఫ్ట్ ఆపరేటర్లను తొలగించారు. వారికి కనీసం నోటీసు కూడా ఇవ్వలేదు.

ఇంత దారుణం చూడలేదు



బాబు వస్తే జాబు వస్తుందన్నారు. కానీ మా జాబులు పీకేశారు. నేను ఐటీఐ చేసి ఈ ఉద్యోగానికి వచ్చా. ఈ ఉద్యోగంపై ఆధారపడి నేను, నా భార్య, ఇద్దరు కుమారులు జీవిస్తున్నాం. ఏ తప్పు చేయని నన్ను నోటీస్ కూడా ఇవ్వకుండా తొలగించారు. నా స్థానంలో గణపవరానికి చెందిన శ్రీకాంత్‌ను నియమించారు.

–వజ్రాల వీరారెడ్డి, తొలగించబడిన షిఫ్ట్ ఆపరేటర్, కొమెరపూడి

ఆత్మహత్యే శరణ్యం



నేను ఐటీఐ చేసి షిఫ్ట్ ఆపరేటర్‌గా ఉద్యోగంలో చేరా. ప్రస్తుతం నా వయసు 39. భవిష్యత్తులో నాకు ఏ ఉద్యోగమూ వచ్చే అవకాశం లేదు. నన్ను ఉన్నఫలంగా తొలగించి నా స్థానంలో మా గ్రామానికి చెందిన సంకటి చంద్రశేఖర్‌ను నియమించారు. ఇకపై నా కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలి. నాకు న్యాయం చేయకపోతే ఆత్మహత్యే శరణ్యం.

–షేక్ మహబూబ్ సుభాని, తొలగించబడిన షిఫ్ట్ ఆపరేటర్, కొమెరపూడి

నోటీసు కూడా ఇవ్వలేదు



నేను ఐటీఐ చేసి 2023 నవంబర్‌లో షిఫ్ట్ ఆపరేటర్‌గా చేరాను. అంతకు ముందు కొమెరపూడిలో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి నేను 80 సెంట్ల స్థలాన్ని ఉచితంగా గ్రామపంచాయతీ ద్వారా సబ్‌స్టేషన్‌కు ఇచ్చాను. ప్రతిఫలంగా నాకు ఉద్యోగం ఇచ్చారు. ఈ ఉద్యోగంపైనే నా భార్య, ముగ్గురు పిల్లలు ఆధారపడి జీవిస్తున్నారు. నన్ను తొలగించి నా స్థానంలో సత్తెనపల్లికి చెందిన గౌస్‌బాజీని నియమించారు. కనీసం నోటీసు కూడా ఇవ్వలేదు.

–చింతా సుధీర్, తొలగించబడిన షిఫ్ట్ ఆపరేటర్, ఫణిదం

న్యాయం చేసి ఆదుకోవాలి



రాజకీయపార్టీల ముద్ర వేసి ఏ తప్పు చేయని నన్ను ఉద్యోగం నుంచి తొలగించారు. నా గోడును విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. ఉన్నఫలంగా రోడ్డుపాలు చేశారు. నా స్థానంలో ధూళిపాళ్లకు చెందిన సీహెచ్ శ్రీకాంత్‌ను నియమించారు.

–అన్నపురెడ్డి అఖిల్‌రెడ్డి, తొలగించబడిన షిఫ్ట్ ఆపరేటర్, కొమెరపూడి

మట్టి గణనాథునికి ప్రత్యేక పూజలు

కోటప్పకొండ రోడ్డు గణేష్ సెంటర్‌లో మట్టితో విగ్రహం ఏర్పాటు



కోటప్పకొండ రోడ్డులో పూజలు అందుకుంటున్న గణేశుని మట్టి విగ్రహం

నరసరావుపేట: స్థానిక కోటప్పకొండ రోడ్డులోని గణేష్ సెంటర్ వద్ద వినాయక చవితి పందిరి పర్యావరణాన్ని కాపాడటంలో ముందుంది. ఐదేళ్లుగా గణేష్ పందిరిలో మట్టి విగ్రహాన్ని ఏర్పాటు చేసి పర్యావరణాన్ని కాపాడేందుకు నిర్వాహకులు కృషిచేస్తున్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేసిన విగ్రహాలతో ఏర్పడే వాతావరణం, వాయు, నీటి కాలుష్యం గురించి ప్రజల్లో అవగాహన కల్పించేందుకు తమ కమిటీ మట్టి విగ్రహాలతో పండుగ నిర్వహిస్తున్నామని గణేష్ ఉత్సవాలు కమిటీ కన్వీనర్ అల్లంశెట్టి కిషోర్‌బాబు, విజయ గణపతి ఫౌండేషన్ ప్రెసిడెంట్ జలసూత్రం సృజన్, కమిటీ సభ్యులు పేర్కొన్నారు. పట్టణంలో తొలిసారిగా మట్టి విగ్రహాలు పెట్టి పూజలు నిర్వహిస్తుందని తమ పందిరిలోనేనని కన్వీనర్ కిషోర్ బాబు తెలిపారు. ఐదో రోజు ఈనెల 31న స్వామి వారి పందిరిలో ఐదు వేల మందికి అన్నదానం నిర్వహిస్తామన్నారు. ఈ ఏడాది పందిరిలో బ్రహ్మశ్రీ తుర్లపాటి హరికృష్ణశర్మచే సెప్టెంబరు ఒకటో తేదీ సాయంత్రం ఆరు గంటలకు అయ్యప్పస్వామి పడిపూజ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. దీనికి భక్తులందరూ వచ్చి పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

క్రీడలకు ప్రోత్సాహమేదీ..?



పిడుగురాళ్లలోని మన్నెం పుల్లారెడ్డి జెడ్పీ హైస్కూల్‌లో నిలిచిపోయిన రన్నింగ్ ట్రాక్ పనులు



సాఫ్ట్‌బాల్ ఆడుతున్న క్రీడాకారులు(ఫైల్)

- పాఠశాలల్లో మైదానాలు, క్రీడా పరికరాలు కరువు
- కొన్ని పాఠశాల్లో పీఈటీలు, పీడీలు సైతం లేనివైనం
- తరగతి గదుల్లో బందీలుగా విద్యార్థులు
- నేడు జాతీయ క్రీడా దినోత్సవం

పిడుగురాళ్లరూరల్: భారత హాకీ క్రీడాకారుడైన ధ్యాన్‌చంద్ గౌరవ సూచకంగా అతని పుట్టిన రోజైన ఆగస్టు 29న జాతీయ క్రీడా దినోత్సవంగా జరుపుకొంటారు. అన్ని రంగాల్లో గ్రామీణ విద్యార్థులు ప్రతిభ చాటాలని.. గ్రామీణస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు క్రీడల్లో రాణించాలని గొప్పలు చెప్పుకుంటున్న అధికారులు, ప్రజాప్రతినిధులు ఇందుకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంలో మాత్రం చొరవ చూపించడం లేదు. సరైన క్రీడా మైదానాలు.. ఆడుకోవడానికి క్రీడా పరికరాలు లేక విద్యార్థులు తరగతి గదులకే పరిమితం కావాల్సి వస్తోంది. క్రీడలపై మక్కువ ఉన్న విద్యార్థులు ఉన్న అరకొర వసతులతో రాణించాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు.

నిబంధనలపై పట్టింపేది?

జిల్లాలోనే చాలా ప్రైవేట్ పాఠశాలల్లో దాదాపు 70 పైగా క్రీడా మైదానాలు లేవని అధికారులు గుర్తించారు. నిబంధనల ప్రకారం మైదానాలు ఉన్న పాఠశాలకే అనుమతులు ఇవ్వాల్సి ఉండగా, సంబంధిత శాఖ అధికారులు సొంత లాభాలు చూసుకొని నిబంధన పక్కన పెట్టారనే ఆరోపణలు లేకపోలేదు. ఉదయం నుంచి సాయంత్రం వరకు తరగతులు నిర్వహించడం, కనీసం 45 నిమిషాలు కూడా వారికి ఆటలు ఆడేందుకు అవకాశం కల్పించడం లేదు.. కొన్ని ప్రైవేట్ పాఠశాలలో అయితే పీఈటీలు, పీడీలు లేకుండా కొనసాగుతున్నాయి.

గురువులు ఉన్నా లేనట్టే...

కొన్ని పాఠశాలల్లో క్రీడా మైదానాలు, తగిన పరికరాలు లేకపోవడంతో ఆయా పాఠశాలల్లో క్రీడా గురువులు ఉన్నా లేనట్టుగానే ఉంది. ఉదయం ప్రార్థన మందిరంలో విద్యార్థులను వరుస క్రమంలో నిలబెట్టడం.. పాఠశాలల్లో ఇతర పనులకు మాత్రమే క్రీడాగురువులు పరిమితమవుతున్నారు. కొన్నిచోట్ల పాఠశాలలకు సరైన ఆర్థిక వనరులు లేకపోవడంతో ఉపాధ్యాయులు దాతలు సహాయంతో క్రీడా పరికరాలను అరకొరగా సమకూర్చుకుంటున్నారు.

కొద్ది రోజుల్లో స్కూల్ ఫెడరేషన్ గేమ్స్‌కు విద్యార్థులు సంసిద్ధం కావలసి ఉండగా, కొన్ని పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయులు లేక విద్యార్థులు గ్రౌండ్ వైపు కూడా చూడటం లేదు. ఇకనైనా అధికారులు చొరవ తీసుకొని విద్యార్థులకు అవసరమైన క్రీడా మైదానాలు ఏర్పరిచి, పరికరాలు సమకూర్చాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

- పాఠశాలల్లో పీఈటీలు, పీడీల కొరతపై మండల విద్యాశాఖాధికారి శ్రీనివాసరెడ్డిని వివరణ కోరగా ప్రస్తుతం పాఠశాలల్లో కొరత ఉన్నమాట వాస్తవమేనని, ప్రభుత్వ ప్రకటించిన మెగా డీఎస్సీలో మండలంలో ఖాళీగా ఉన్న వ్యాయామ ఉపాధ్యాయుల ఉద్యోగాలు భర్తీ అవుతాయని తెలిపారు.

ప్రతిభావంతులకే అవకాశం కల్పించాలి



ప్రస్తుతం చదువులకు ఉన్న ప్రాధాన్యం క్రీడలకు దక్కడం లేదు. దీంతో సామర్థ్యం ఉన్న విద్యార్థులు, యువత క్రీడలకు దూరమవుతున్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చి వివిధ క్రీడా వేదికలపై పతకాలు సాధిస్తున్న క్రీడాకారులకు ప్రోత్సాహం లేక వారిలో ఉన్న నైపుణ్యం గుర్తించక భారత క్రీడా ఉజ్వల భవిష్యత్తును నీరు కారుస్తున్నారు. ప్రతిభ ఉన్న వారికి అవకాశాలు కల్పించాలి.

– ఏపూరి గోవిందరాజులు, సెంట్రల్ జోన్ రన్నింగ్ రేస్ గోల్డ్ మెడలిస్ట్, కామేపల్లి

నైపుణ్యాన్ని గుర్తించాలి



క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని గుర్తిస్తే మన జిల్లాకి, రాష్ట్రానికి ఎంతో పేరు వస్తుంది. అసోసియేషన్లలో గ్రూపు రాజకీయాల వల్ల ప్రతిభ గల క్రీడాకారులకు అన్యాయం జరుగుతుంది.. పల్నాడు ప్రాంతంలో గుర జాల, మాచర్ల, పెదకూరపాడు నియోజకవర్గంలోనే క్రీడాకారులు ఎంపికలో అన్యాయం జరుగుతుంది. దీనిపై అధికారులు స్పందించి ప్రతిభ కలిగిన క్రీడాకారులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలి.

– కె.రత్నబాబు, మాజీ క్రికెట్ క్రీడాకారుడు, పిడుగురాళ్ల

యువతను ప్రోత్సహించాలి



గ్రామీణస్థాయి క్రీడాకారులను వెలుగులోకి తీసుకురావడం, వారిని ప్రోత్సహించడం చేయాలి. గ్రామాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడలకు సంబంధించిన వివిధ కార్యక్రమాలు, సెమినార్స్ నిర్వహించాలి. క్రీడల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించడంతోపాటు.. యువత ఆటలను పాల్గొనడానికి, వారి జీవితంలో ఒక అంతర్భాగంగా మార్చుకునేలా, క్రీడలను ప్రోత్సహించేలా కార్యక్రమాలు చేపట్టాలి.

– జి.ప్రభాకర్, రిటైర్డ్ పీడీ, ఏసీ కాలేజ్ కబడ్డీ జట్టు మాజీ కెప్టెన్

డబ్బుకు కక్కుర్తిపడి షిఫ్ట్ ఆపరేటర్ల తొలగింపు




బాధితులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి అంబటి రాంబాబు, గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి

- కొత్త వారి నుంచి రూ.5, రూ.10 లక్షలు వసూలు
- వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు

సత్తెనపల్లి: డబ్బుకు కక్కుర్తిపడి విద్యుత్ సబ్‌స్టేషన్‌లలో పనిచేసే షిఫ్ట్ ఆపరేటర్లను తొలగించడం దుర్మార్గమని వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. సత్తెనపల్లి మండలం కొమెరపూడి గ్రామంలోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో షిఫ్ట్ ఆపరేటర్లుగా పనిచేస్తున్న నలుగురిని ఎలాంటి నోటీసు ఇవ్వకుండా ఈనెల 21 నుంచి మౌఖిక ఆదేశాలతో తొలగించడంతో వారు గురువారం విద్యుత్ సబ్‌స్టేషన్‌కు తాళాలు వేసి రోడ్డుపై బైఠాయించి ఆందోళన నిర్వహించారు. వారికి వైఎస్సార్ సీపీ సంఘీభావం తెలిపింది. మాజీ మంత్రి రాంబాబు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో తాను సత్తెనపల్లి శాసనసభ్యుడిగా, మంత్రిగా కొనసాగిన సమయంలో 34 మంది షిఫ్ట్ ఆపరేటర్లను నియ మించినట్లు తెలిపారు. వారి నుంచి ఒక్క పైసా కూడా ఆశించలేదన్నారు. నా కన్నా ముందు తెలుగుదేశం శాసనసభ్యుడు నియమించిన ఏ ఒక్క షిఫ్ట్ ఆపరేటర్‌ను తొలగించలేదన్నారు. రూ.5 లక్షలు, రూ.10 లక్షలు ఇస్తే వాళ్లను తీసుకువచ్చి కొత్తగా ఇక్కడ వేస్తారన్నారు. 19 మందిని తొలగించారని, అంటే ఒక్కొక్కరి నుంచి రూ.5 లక్షలు చొప్పున రూ.95 లక్షలు బేరం పెట్టుకున్నారని, స్థానిక శాసనసభ్యుడు కన్నా లక్ష్మీనారాయణను అడుగుతున్నా రూ.95 లక్షలు తీసుకున్నారా లేదా అని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి మాట్లాడుతూ చిరు ఉద్యోగుల పొట్ట కొట్టవద్దన్నారు. 2023లో నియమితులైన నలుగురు షిఫ్ట్ ఆపరేటర్లను తొలగించడం, కనీసం నోటీసు కూడా ఇవ్వకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు, యువజన విభాగం మాజీ అధ్యక్షుడు కళ్లం విజయ భాస్కరరెడ్డి, మాజీ సర్పంచ్ లక్కిరెడ్డి భాస్కరరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, బాధితుల బంధువులు పాల్గొన్నారు.

బీ ఫార్మసీ విద్యార్థి మృతి



సూర్య (ఫైల్)

సత్తెనపల్లి: ఆత్మహత్యాయత్నం చేసిన బీ ఫార్మసీ విద్యార్థి చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాలు ఇలా...అచ్చంపేట మండలం అంబటిపూడి గ్రామానికి చెందిన తాళ్లూరు సూర్య (23) సత్తెనపల్లి రైల్వేగేట్ సమీపంలోని నిర్మలా నగర్‌లోని ఎస్సీ కళాశాల బాలుర వసతి గృహంలో ఉంటున్నాడు. మేడికొండూరు మండలం జంగంగుంట్లపాలెంలోని కేసీరెడ్డి కళాశాలలో బీ ఫార్మసీ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. ఈ నెల 22న ఇంటికి వెళ్లిన సూర్య తిరిగి 26న హాస్టల్‌కు వచ్చాడు. మళ్లీ బయటకు వెళ్లి గంట తర్వాత తిరి గొచ్చి కుక్‌గా పని చేస్తున్న వంగూరి శ్యామ్‌బాబుతో తనకు కళ్లు తిరుగుతున్నాయని, వైద్యశాలకు తీసుకెళ్లాలని కోరాడు. అనుమానంతో ప్రశ్నించగా పురుగుమందు తాగానని చెప్పటంతో వెంటనే వార్డెన్ దాసరి పాపయ్యకు శ్యామ్‌బాబు సమాచారం ఇచ్చారు. సూర్యను సత్తెనపల్లి ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించారు. వైద్యులు ప్రాథమిక చికిత్స అందించారు. మెరుగైన చికిత్స కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ 27న సూర్య మృతి చెందాడు. ఓ విద్యార్థినితో చనువుగా మాట్లాడుతున్నందున వైస్ ప్రిన్సిపల్, ప్రిన్సిపల్ మందలించి టీసీ ఇస్తానని హెచ్చరించడంతో మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు చనిపోయే ముందు తన తల్లిదండ్రులు అశోక్, సుజాత, హాస్టల్ వార్డెన్ పాపయ్యకు సూర్య చెప్పాడు. అతడి మృతితో తల్లిదండ్రులు, ఇతర కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. మృతదేహానికి గుంటూరు జీజీహెచ్‌లో పోస్టుమార్టం నిర్వహించి గురువారం తల్లిదండ్రులకు అప్పగించారు.

అప్పీలుపై తుది నిర్ణయం వచ్చే వరకు పింఛన్లు

జాయింట్ కలెక్టర్ సూరజ్



వీడియా కాన్ఫరెన్స్‌లో జేసీ, అధికారులు

నరసరావుపేట: ఎన్టీఆర్ భరోసా పింఛను అర్హత నోటీసులు అందుకున్న వారు సంబంధిత ఎంపీడీఓ కార్యాలయంలో అప్పీలు సమర్పించుకునే అవకాశం ఇంకా ఉందని, ఇప్పటికే అప్పీలు చేసుకున్న వారికి తుది నిర్ణయం వచ్చేవరకు అంతరాయం లేకుండా పింఛన్లు కొనసాగుతాయని జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే పేర్కొన్నారు. తాత్కాలిక వికలాంగత్వం సర్టిఫికెట్లు కలిగిన అర్హులకు కూడా పింఛన్లు పంపిణీ చేస్తామని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ గురువారం అమరావతి నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్, ఇతర అధికారులు కలెక్టరేట్ నుంచి పాల్గొన్నారు. అనంతరం జేసీ మాట్లాడుతూ నోటీసు అందుకుని ఇప్పటి వరకు అప్పీలు చేయనివారు సంబంధిత మండల అభివృద్ధి కార్యాలయాల్లో అప్పీలు చేసుకోవాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా భూగర్భ జలాల పునరుద్ధరణ కోసం పైకప్పు వర్షపు నీటి సేకరణ వ్యవస్థలు, చెరువుల పునరుద్ధరణ, చెక్‌డ్యామ్‌లు, రీఛార్జ్ పిట్‌లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. రైతు సేవా కేంద్రాల ద్వారా అర్హులైన రైతులకు యూరియా సరఫరా, పీఎం కుసుమ్ పథకంలో 10 మెగావాట్ల సామర్థ్యం గల సౌర విద్యుత్ ప్లాంట్ల కోసం అవసరమైన భూమిని గుర్తించి త్వరితగతిన చర్యలు చేపట్టాలని సూచించారు.

ప్రతి ఒక్కరి జీవితంలో యోగా భాగం కావాలి



క్రీడాకారుల నుంచి గౌరవవందనం స్వీకరిస్తున్న అతిథులు, అధ్యాపకులు


వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన పీఈటీలు, ఎస్కార్ట్‌లు

- జేఎన్‌ఎస్ డిప్యూటీ కమిషనర్ అభిజిత్ బెహ్రా
- జేఎన్‌వీలో ప్రారంభమైన జాతీయస్థాయి యోగా విన్యాసాల ప్రదర్శన పోటీలు
- దేశవ్యాప్తంగా జేఎన్‌వీల నుంచి వచ్చిన యోగ సాధకులు
- పోటీలకు వేదికైన మద్దిరాల నవోదయ విద్యాలయం

చిలకలూరిపేట టౌన్/యడ్లపాడు: యోగా ప్రాణాయామం ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలని ఆచరణతో ఆరోగ్యం.. ఆనందమయ జీవితం సాధ్యమవుతుందని నవోదయ విద్యాలయ సమితి డిప్యూటీ కమిషనర్ (హైదరాబాద్ రీజియన్) అభిజిత్‌బెహ్రా పేర్కొన్నారు. చిలకలూరిపేట మండలంలోని మద్దిరాల పీఎంశ్రీ జవహర్ నవోదయ విద్యాలయంలో జాతీయస్థాయి యోగా విన్యాసాల ప్రదర్శన పోటీలు బుధవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. దేశంలోని 8 జవహర్ నవోదయ విద్య సమితి పరిధిలో ప్రాంతీయ స్థాయి యోగా పోటీల్లో విజేతలు తమ శిక్షణ గురువులు, ఎస్కార్టులు తరలివచ్చారు. తొలుత అతిథులు అభిజిత్ బెహ్రా, ధనలక్ష్మి గ్రూప్స్ డైరెక్టర్ సాధినేని హనుమంతరావులను పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతించగా, కళాశాల అధ్యాపకులు బొకేలను అందించారు. అనంతరం ఆయా రాష్ట్రాల నుంచి విచ్చేసిన జేఎన్‌వీ విద్యార్థులు మార్చ్‌ఫాస్టు నిర్వహిస్తూ గౌరవ వందనం చేయగా, అతిథులు స్వీకరించారు.

ప్రారంభోత్సవ సమావేశంలో...

సర్వేంద్రియాలు మన ఆధీనంలో ఉండాలంటే మన ఆత్మ ఏకాంతంగా ఉండాలని అందుకు నిత్యం యోగా ఆచరణ ఒక్కటే ఏకైక మార్గమని జేఎన్‌ఎస్ హైదరాబాద్ రీజియన్ డీసీ అభిజిత్ బెహ్రా చెప్పారు. విద్యాలయ ప్రిన్సిపాల్ నల్లూరి నరసింహారావు అధ్యక్షత వహించారు. మరో అతిథి ధనలక్ష్మి గ్రూప్స్ డైరెక్టర్ సాధినేని హనుమంతరావు మాట్లాడుతూ మద్దిరాల జేఎన్‌వీ స్థాపనకు తమ కుటుంబం 30 ఎకరాల స్థలాన్ని భూరి విరాళంగా అందించిన విషయాన్ని గుర్తు చేశారు. విద్యాలయంలో జరిగే ప్రతి కార్యక్రమానికి తాము తప్పక అన్ని విధాల సహాయ సహకారాలు అందిచేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. విద్యార్థి దశలో క్రీడలు నిత్య జీవితంలో భాగం కావాలని, ఏ రంగంలోనైనా మనస్సు పెట్టి సాధన చేస్తే సాధ్యం కానిది లేదన్నారు. కార్యక్రమంలో విద్యాలయ ప్రిన్సిపాల్ నల్లూరి నరసింహారావు, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, పీఈటీలు ఆర్ పాండురంగారావు, జి గోవిందమ్మ, అధ్యాపకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

31న జిల్లా స్థాయి టెన్నికాయిట్ పోటీలు

నరసరావుపేట రూరల్: ఉమ్మడి గుంటూరు జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 31వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు లింగంగుంట్ల శంకర భారతీపురం జెడ్పీ హైస్కూల్‌లో జూనియర్, సబ్ జూనియర్, సీనియర్ టెన్నికాయిట్ ఆటల పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు అసోసియేషన్ అధ్యక్షుడు నిడికొండ జానకిరామయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలలో ప్రతిభావంతులైన క్రీడాకారులను ఎంపిక చేసి సెప్టెంబర్ 13, 14వ తేదీలలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటలో జరిగే రాష్ట్ర స్థాయి సీనియర్ పోటీలకు పంపనున్నట్లు పేర్కొన్నారు. సబ్ జూనియర్ విభాగంలో క్రీడాకారులు 01-01-2011, జూనియర్ విభాగంలో పాల్గొనే వారు 01-01-2007 తరువాత పుట్టిన వారై ఉండాలని తెలిపారు. పోటీలకు హాజరయ్యే వారు వయసు ధ్రువీకరణపత్రంతో రావాలని సూచించారు. పూర్తి వివరాలకు పి.తిరుపతిరావు - 97016 18000, ఝాన్సీరాణి - 99495 33234 ఫోను నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

జిల్లాలో 2,727 మందికి నోటీసులు

నరసరావుపేట: జిల్లాలో దివ్యాంగుల పెన్షన్లకు సంబంధించి రీ అసెస్మెంట్ చేసి 2,727 మందికి నోటీసులు ఇచ్చినట్లు డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఝాన్సీరాణి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్‌లు, ఎంపీడీఓల వద్ద వీరిలోని 1,807 మంది అప్పీలు చేసుకున్నట్లు తెలిపారు. పెండింగ్ ఉన్న వారు తమ అర్హతను బట్టి అప్పీలు చేసుకోవాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల జిల్లా అధ్యక్షులు నియామకం



నరసరావుపేట: వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు చిలకలూరిపేట అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన ఇద్దరు నాయకులను పల్నాడు జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులుగా నియమించారు. ఈ మేరకు కేంద్ర పార్టీ కార్యాలయం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు తాళ్ల అంజిరెడ్డిని ఇంటలెక్చ్యువల్ ఫోరం, ఆవల ఏసురత్నంను అంగన్‌వాడీ వింగ్‌కు నియమించారు.

రాష్ట్ర అనుబంధ విభాగంలో ఇద్దరు..

పల్నాడు జిల్లాకు చెందిన ఇద్దరు నాయకులను రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీలో నియమిస్తూ కేంద్ర పార్టీ కార్యాలయం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఊస సబారి (చిలకలూరిపేట)ని విద్యార్థి విభాగ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా, మేడం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి (సత్తెనపల్లికి)ని బూత్ కమిటీ వింగ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించారు.

జిల్లా ఎస్పీ కార్యాలయంలో చవితి వేడుకలు


వినాయక పూజలో జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు

నరసరావుపేట రూరల్: జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం వినాయక చవితి వేడుకలను నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలో గణనాథుడిని ప్రతిష్ఠించారు. జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు పూజల్లో పాల్గొన్నారు. అర్చకులు పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ విఘ్నేశ్వరుడి కరుణా కటాక్షాలు జిల్లా ప్రజలపై ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ జేవీ సంతోష్, ఏఆర్ డీఎస్పీ గాంధీరెడ్డి, మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ వెంకటరమణ, ఎంటీ ఆర్ఐ ఎస్.కృష్ణ, వన్ టౌన్ సీఐ ఎంవీ చరణ్, వేల్ఫేర్ ఆర్ఐ ఎల్.గోపీనాథ్, రూరల్ ఎస్ఐ కిషోర్ పాల్గొన్నారు.

30 నుంచి రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు


ఆహ్వాన పత్రం ఆవిష్కరిస్తున్న దృశ్యం

సత్తెనపల్లి: ఈ నెల 30, 31వ తేదీలలో మహిళలకు రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలను సత్తెనపల్లి మండలం ధూళ్ళిపాళ్ల సమీపంలోని లయోలా ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 30, 31వ తేదీలలో నిర్వహించనున్నారు. ఈ మేరకు ఉమ్మడి గుంటూరు జిల్లా అమెచ్యూర్ సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఇ.వంశీకృష్ణారెడ్డి, పి.సామంత్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఆహ్వానపత్రాన్ని డీఎస్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్ దరువూరి నాగేశ్వరరావు తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ పోటీలకు ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే కోన రవి కుమార్, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ ఎ.రవి నాయుడు హాజరవుతారన్నారు. 13 జిల్లాల టీములు పాల్గొంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శి నర్రా శ్రీనివాసరావు, లయోలా ఇంజినీరింగ్ కళాశాల అడ్మిషన్ డైరెక్టర్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఆచార్య నాగార్జునుడి బోధనలు ఆచరణీయం

చికాగో బౌద్ధాలయం సందర్శనలో శివనాగిరెడ్డి


మాట్లాడుతున్న ఈమని శివనాగిరెడ్డి

విజయపురి సౌత్: ఆచార్య నాగార్జునుడి బోధనలు నేటికీ ఆచరణీయమని ప్రముఖ బౌద్ధ పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈవో డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి అన్నారు. ఈ మేరకు మిడ్ వెస్ట్ బౌద్ధాలయాన్ని గురువారం సందర్శించిన సందర్భంగా ఆయన ప్రసంగించినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఆచార్య నాగార్జునుడి మధ్యమమార్గం, శూన్యవాదం, నైతిక వర్తన, సచ్ఛీలత, వివేకం, శాశ్వతానందాన్నిచ్చే బుద్ధుని చతురార్య సత్యాలు, ఆర్య అష్టాంగిక మార్గాలను ఆచరిస్తే ప్రస్తుత సమాజంలోని రుగ్మతలను నిర్మూలించవచ్చని తన ప్రసంగంలో ఆయన వివరించారు. అనంతరం ఆలయ ప్రధానాచార్యులు పూజ్య గ్యాదో కోనో వారి ప్రచురణలను శివనాగిరెడ్డికి బహూకరించారు. ఈ కార్యక్రమంలో చికాగో సాహితీ మిత్రులు, సంస్థ కార్యదర్శి జయదేవ్ మెట్టుపల్లి పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన ముఖ్యం


పోస్టర్లు ప్రదర్శిస్తున్న, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు

నరసరావుపేట: సమాజంలోని ప్రతి ఒక్కరు హెచ్ఐవీ, ఎయిడ్స్ గురించి అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కోరారు. రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు పల్నాడు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ, హాండ్స్ ఆఫ్ కంపాషన్ టార్గెటెడ్ ఇంటర్వెన్షన్ ఆధ్వర్యంలో సమగ్ర శిశు అభివృద్ధి కార్యాలయంలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సూపర్ వైజర్లు జోజమ్మ, గౌస్య, షమీమ్ సుల్తానాలు అంగన్‌వాడీ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. సంబంధిత అంశాలపై వివరించారు. పీపీటీసీ కౌన్సిలర్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 505.4 మి.మీ. వర్షపాతం

నరసరావుపేట: జిల్లాలో గడిచిన 24 గంటల వ్యవధిలో 505.4 మిల్లీమీటర్ల వర్షపాతం కురిసినట్లు అధికారులు గురువారం వెల్లడించారు. అత్యధికంగా రాజుపాలెంలో 49.8 మి.మీ, శావల్యాపురంలో అత్యల్పంగా 1.2 మి.మీ. నమోదైంది. వెల్దుర్తి, బొల్లాపల్లి మండలాలలో వర్షం పడలేదు. మిగతా మండలాలు పరిశీలిస్తే... మాచర్ల 3.2, దుర్గి 3.6, రెంటచింతల 8.6, గురజాల 8.8, దాచేపల్లి 7.4, కారంపూడి 7.2, పిడుగురాళ్ల 14.4, మాచవరం 6.8, బెల్లంకొండ 48.8, అచ్చంపేట 40.4, క్రోసూరు 32.2, అమరావతి 37.2, పెదకూరపాడు 47.2, సత్తెనపల్లి 36.4, నకరికల్లు 20.2, వినుకొండ 8.2, నూజెండ్ల 5.2, ఈపూరు 5.8, రొంపిచర్ల 6.4, నరసరావుపేట 16.4, ముప్పాళ్ల 29.4, నాదెండ్ల 28.2, చిలకలూరిపేట 8.8, యడ్లపాడు 23.6 మి.మీ. చొప్పున వర్షపాతం కురిసింది.

వైఎస్సార్ సీపీ నేతపై కేసు నమోదు

సత్తెనపల్లి: వైఎస్సార్ సీపీ యువజన విభాగం మాజీ అధ్యక్షుడు కళ్ళం విజయభాస్కరరెడ్డిపై సత్తెనపల్లి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాలు ఇలా ఉన్నాయి... ఎలాంటి తప్పు చేయకపోయినా నోటీసులు ఇవ్వకుండా సత్తెనపల్లి మండలం కొమెరపూడిలోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నలుగురు షిఫ్ట్ ఆపరేటర్లను అర్ధాంతరంగా తొలగించడంతో గురువారం వారు శాంతియుత ఆందోళన చేశారు. వారికి వైఎస్సార్ సీపీ సంఘీభావం తెలిపింది. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించారంటూ విజయభాస్కరరెడ్డి, మరి కొందరిపై కేసు నమోదు చేశారు. కాగా కొమెరపూడి 33/11కేవీ సబ్‌స్టేషన్‌కు గుర్తుతెలియని వ్యక్తులు తాళాలు వేశారని విద్యుత్ శాఖ సత్తెనపల్లి రూరల్ ఏఈ సత్తెనపల్లి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అమరుల స్ఫూర్తితో మరో విద్యుత్ ఉద్యమం



మాట్లాడుతున్న ముప్పాళ్ల

నరసరావుపేట: విద్యుత్ అమరవీరుల పోరాట స్ఫూర్తితో ప్రజలను మరో విద్యుత్ పోరాటానికి సిద్ధం చేయాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. పట్టణంలోని స్టేషన్‌రోడ్డు గాంధీ పార్కు వద్ద ధర్నాచౌక్‌లో గురువారం బషీర్‌బాగ్ విద్యుత్ అమరవీరులకు నివాళి, సంస్మరణ సభ నిర్వహించారు. విష్ణువర్ధన్ రెడ్డి, రామకృష్ణ, బాలస్వామి చిత్రపటాలకు నివాళులర్పించారు. సీపీఎం నరసరావుపేట మండల కార్యదర్శి డి.శివకుమారి అధ్యక్షతన జరిగిన సభకు ముఖ్యఅతిథిగా హాజరైన ముప్పాళ్ల నాటి పోరాటం తీరు గుర్తుచేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.ఆంజనేయులు, సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.మారుతి వరప్రసాద్, సహాయ కార్యదర్శి కాసా రాంబాబు, ఎంసీపీఐయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్ బాషా, సీపీఐఎంఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట ఆంజనేయులు, ప్రగతిశీల కార్మిక సమాఖ్య నాయకులు కె.ఏడుకొండలు, కుల నిర్మూలన పోరాట సమితి నాయకులు కృష్ణ, పీడీఎం రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరరావు , సీపీఎం నాయకులు షేక్ సిలార్ మసూద్, సయ్యద్ రబ్బాని, కామినేని రామారావు పాల్గొన్నారు.

ఏఆర్ కానిస్టేబుల్‌పై కేసు నమోదు


షరీఫ్

మాచర్ల రూరల్: మాచర్ల రూరల్ పోలీసు స్టేషన్‌లో ఏఆర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న షరీఫ్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు రూరల్ సీఐ షేక్ హాఫీజ్ బాషా తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ... పట్టణ శివారులోని ఎంఎస్ఆర్ టౌన్‌షిప్‌లో నివాసం ఉంటున్న మహిళను అతడు వేధిస్తున్నట్లు ఫిర్యాదు అందిందన్నారు. దీంతో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశామన్నారు. విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు చెప్పారు. మహిళ నగదు ఇవ్వాలని తనను బెదిరిస్తున్నట్లు ఆరోపిస్తూ షరీఫ్ సెల్ఫీ వీడియో తీసి, ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతున్నట్లు వీడియో చిత్రీకరించి సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో కలకలం రేగింది. దీనిపై పోలీసులు పూర్తి స్థాయి విచారణ చేపట్టి షరీఫ్‌పై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు పంపారు.

గ్యాంగ్ రేప్ కేసులో నిందితులకు రిమాండ్

నరసరావుపేట టౌన్: వివాహితపై గ్యాంగ్ రేప్ కేసులో నిందితులైన రొంపిచర్ల మండలం సంతగుడిపాడు గ్రామానికి చెందిన గుడిపాటి పుల్లారావు, ఉయ్యాల శివయ్యలకు రిమాండ్ విధిస్తూ రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఇన్‌చార్జి న్యాయమూర్తి ఎ. సలోమి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 25వ తేదీ రాత్రి నిందితులు తనపై గ్యాంగ్ రేప్‌కు పాల్పడినట్లు బాధితురాలు రొంపిచర్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రాథమిక దర్యాప్తు అనంతరం నిందితులను గురువారం అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరు పరిచారు. రిమాండ్ విధించటంతో సబ్‌జైలుకు తరలించారు.

జాయింట్ డైరెక్టర్‌గా శ్రీనివాసులురెడ్డికి పదోన్నతి



గుంటూరు మెడికల్: గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు (ఆర్డీ) కార్యాలయంలో డెప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న గుర్రం శ్రీనివాసులురెడ్డికి జాయింట్ డైరెక్టర్‌గా పదోన్నతి లభించింది. ఈ మేరకు గురువారం రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు ఉత్తర్వులు జారీ చేశారు. జాయింట్ డైరెక్టర్‌గా ప్రమోషన్ ఇచ్చి విజయవాడ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) కార్యాలయంలో పోస్టింగ్ ఆర్డర్ ఇచ్చారు. చిత్తూరు జిల్లా మదనపల్లి మండలం గుర్రంకొండ గ్రామానికి చెందిన శ్రీనివాసులురెడ్డి ఏపీపీఎస్ ద్వారా గ్రూప్-1 రాసి, 1998లో ప్రమోషన్ పొంది తిరుపతి రుయా ప్రభుత్వ ఆసుపత్రిలో ఏవోగా విధుల్లో చేరారు. అసిస్టెంట్ డైరెక్టర్‌గా 2001లో పదోన్నతి పొంది, హైదరాబాద్ ఉస్మానియా ఆసుపత్రికి బదిలీ అయ్యారు. డెప్యూటీ డైరెక్టర్‌గా 2005లో ప్రమోషన్ పొంది, హైదరాబాద్ ఆర్డీ కార్యాలయానికి వెళ్లారు. మూడేళ్లుగా గుంటూరులో మెడికల్ అండ్ హెల్త్ రీజినల్ డైరెక్టర్ కార్యాలయంలో డీడీగా పనిచేస్తున్నారు. గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు (ఆర్డీ) కార్యాలయం డెప్యూటీ డైరెక్టర్ బి.పాల్‌సుధాకర్‌ను నియమిస్తూ డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ కె.పద్మావతి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం పాల్ సుధాకర్ గుంటూరు వైద్య కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల అసిస్టెంట్ డైరెక్టర్ నుంచి డెప్యూటీ డైరెక్టర్‌గా పాల్ సుధాకర్ పదోన్నతి పొందారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


ఉదయభాస్కర్(ఫైల్)

చిలకలూరిపేట: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. పట్టణంలోని మెయిన్‌బజారులో ఉండే కొత్తమాసు ఉదయభాస్కర్(54) నరసరావుపేటకు బైక్‌పై వెళుతున్నాడు. కావూరు గ్రామం వద్ద మరో బైకును ఢీకొని, అదుపుతప్పి రోడ్డుపై పడటంతో మృతి చెందాడు. రెండో వాహనంపై ఉన్న వారు రోడ్డు మార్జిన్‌లో పడటంతో గాయాలైనట్లు తెలుస్తోంది. ఉదయభాస్కర్ మమ్మీడాడీ రెడీమేడ్ షోరూమ్ యజమానుల్లో ఒకరిగా స్థానికులకు సుపరిచితుడు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.